ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

సోమవారం 17 నవంబరు 2025



రేపు సర్దార్ యూనిటీ మార్చ్

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దేశ నిర్మాణం దిశగా యువతలో స్ఫూర్తిని నింపడానికి ఈ నెల 18న సర్దార్ @ 150 యూనిటీ మార్చ్ (పాదయాత్ర)లో యువత, విద్యార్థులు పాలుపంచుకోవాలని ఆదివారం మేరా యువభారత్ జిల్లా యూత్ అధికారి ఎం వెంకట్ రాంబాబు తెలిపారు. ఈ నెల 18న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రం లోని బతుకమ్మ ఘాట్ నుంచి పాదయాత్ర ప్రారంభమై స్థానిక గాంధీచౌక్ మీదుగా మినీట్యాంక్ బండ్ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు తరగతులు

గంభీరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు శనివారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి విద్యార్థులకు, కౌన్సిలర్స్‌కు పలు సూచనలు చేశారు. స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ వాణి 2025-26 సంవత్సరానికి సిలబస్ కాంటాక్ట్, కౌన్సెలింగ్ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, కౌన్సిలర్స్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు.

కోతుల నివారణకు చర్యలు

గంభీరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో కోతుల నివారణకు ఆదివారం చర్యలు చేపట్టారు. రోజు రోజుకు కోతుల బెడద అధికమవుతున్నందున నివారణ కోసం గ్రామస్థులు ఇటీవల సమావేశమయ్యారు. అవసరమైతే ఇంటింటికి తలా కొంత పోగుచేసి కోతులను పట్టే వారిని రప్పించారు. చిగురుమామిడి నుంచి కోతులను పట్టే వారిని రప్పించి ఆదివారం కోతులను పట్టడం మొదలుపెట్టారు. మొదటి రోజు 86 కోతులను పట్టేశారు.

టెట్ టెన్షన్



- సుప్రీంకోర్టు తీర్పుతో ఉపాధ్యాయుల్లో గుబులు
- జిల్లాలో టెట్ రాయాల్సిన ఉపాధ్యాయులు సుమారు 1400 మంది
- ఈ నెల 29 వరకు టెట్ దరఖాస్తుల స్వీకరణ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పరీక్షలు అంటే విద్యార్థులకు టెన్షన్ పట్టుకుంటుంది. కానీ ఇప్పుడు ఉపాధ్యాయుల్లో టెట్ పరీక్షపై ఆందోళన నెలకొన్నది. రెండేళ్లలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఉత్తీర్ణత సాధించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో గుబులు పట్టుకుంది. డీఎస్సీ రాసి అర్హత సాధించి ఉద్యోగంలోకి వచ్చిన వారికి ఇప్పుడు టెట్ అర్హత విధించడం సరైనది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

కొత్త సిలబస్‌తో టెట్ అర్హత సాధించడం కష్టతరమనే ఆందోళన ఉపాధ్యాయుల నుంచి వ్యక్తం అవుతోంది. టీచర్ల పదోన్నతులకు టెట్ అర్హత ఉండాలనే నిబంధన ఎలా ఉన్నా అసలు ఉద్యోగం ఉంచుతారా అనే ఆందోళన మొదలైంది.

జిల్లాలో 70 శాతానికి పైగా..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో489 పాఠశాలు ఉండగా 337 ప్రాథమిక పాఠశాలలు, 38 ప్రాథమికోన్నత పాఠశాలలు, 114 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి పాఠశాలల్లో 2,073 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 750 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 167మంది, ఉన్నత పాఠశాలల్లో 1,156 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

వీరిలో పీఈటీ, పీడీలు మినహాయిస్తే దాదాపు 70 శాతం సుమారుగా 1,400 మంది టెట్ అర్హత సాధించాల్సి ఉంది. టెట్‌లో అర్హత సాధించాలంటే పరీక్షలు



కేటగిరీగా ఓబీసీలకు 90 మార్కులు, బీసీలకు 75 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు 60 మార్కులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. బీఎడ్, డీఎడ్‌తో సంబంధం లేకుండా ఎస్జీటీలుగా కొనసాగుతున్న టెట్ అర్హత లేని ఉపాధ్యాయులు, ఎల్ ఎఫ్ఎల్ ప్రధానో పాధ్యాయులు పేపర్ -1 పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఇంతకుముందే పేపర్ -1 ఉత్తీర్ణత సాధించిన వారు మళ్లీ రాయాల్సిన అవసరం లేదు. టెట్ లేని ఎస్జీటీలు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కావాలన్నా, స్కూల్ అసిస్టెంట్లకు జిహెచ్ఎం పదోన్న తులు కావాలన్నా పేపర్-2 ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి టెట్ తప్పనిసరి చేస్తూ 2010 ఆగస్టు 23న ఎన్‌సీటీఈ ఉత్తర్వులు జారీ చేసింది. దీని తర్వాత టెట్ అర్హత సాధించిన వారే డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఐదేళ్ల లోపు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు మినహా జిల్లాలో వివిధ క్యాడర్లలో ఉన్న మిగతావారు టెట్ రాయాల్సి ఉంటుంది. సర్వీస్‌లో ఉన్న

మిగతా 8వ పేజీలో..

అందరికీ ఒకే సిలబస్

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న టెట్ అర్హత కోసం పరీక్ష రాసే ఉపాధ్యాయులతో పాటు నిరుద్యోగులకు ఒకే విధమైన సిలబస్ అర్హత పరీక్ష ఉండబోతుంది. విద్యా బోధనకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మళ్లీ టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలంటే మళ్లీ సిలబస్ చదవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పాఠశాలల సమయంలో తరగతుల బోధన తప్ప చదువుకునే వీలుండదు. దీంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

పెరుగుతున్న చలి

- జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 8.6 డిగ్రీలు

సిరిసిల్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. సాయంత్రం 6 గంటల నుంచి చల్లని గాలులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లాలో సరాసరి కనిష్ట ఉష్ణోగ్రత 8.6 నమోదు కాగా, గరిష్ట ఉష్ణోగ్రత 32.5 డిగ్రీలు నమోదైంది. రుద్రంగిలో 8.6 డిగ్రీలు నమోదు కాగా గంభీరావుపేటలో 9.1 డిగ్రీలు, బోయిన్‌పల్లిలో 10.0 డిగ్రీలు, వేములవాడరూరల్‌లో 10.4 డిగ్రీలు, వీర్నపల్లి, చందుర్తి, తంగళ్లపల్లిలో 10.5 డిగ్రీలు, కోనరావుపేటలో 11.3 డిగ్రీలు, ఇల్లంతకుంటలో 11.8 డిగ్రీలు ముస్తాబాద్‌లో 11.9 డిగ్రీలు, వేములవాడలో 11.9 డిగ్రీలు, సిరిసిల్లలో 12.1 డిగ్రీలు ఎల్లారెడ్డిపేటలో 12.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు జాగ్రత్త పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

రాచర్లబొప్పాపూర్‌లో తాగునీటి లీకేజీ



లీకైన తాగునీటి పైపు

ఎల్లారెడ్డిపేట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో తాగు నీటి నల్లా పైపు లీకై నీరంతా వృధాగా పోతోంది. నిరంతరం నల్లా నీరు సరఫరా అవుతుండడంతో రాచర్లబొప్పాపూర్- కోరుట్లపేట రోడ్డు బురదమయవుతోంది. నీటి లీకేజీని అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నీరు వృధాగా పోవడంతో పాటు రహదారి బురదగా మారుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి నీటి వృధాను అరికట్టి బురద ఇబ్బందులను తీర్చాలని కాలనీవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సిరిసిల్లలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు, నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా కార్యదర్శి గురుజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఆదివారం సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాలుగవ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సోమవారం జరిగే రాష్ట్ర మధ్యాహ్నభోజన పథకం యూనియన్ మహాసభలకు రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ నాయకులు గోట్టె బాలమణి, మ్యాకల కవిత, వసంత, లక్ష్మీ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

ముస్తాబాద్. నవంబర్ 16 (ఆంధ్రజజ్యోతి) : స్కావెంజర్‌లకు, స్వీపర్లకు కనీస వేతనాలు చెల్లించాలని జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ ఆవరణలో మాట్లాడుతూ స్వీపర్లకు, స్కావెంజర్‌లకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం చెల్లిస్తున్న జీతాలు నేరుగా కార్మికులకు చెల్లించాలని కోరారు. కార్మికుల వేతనంలో కోత విధించకుండా పూర్తి స్థాయిలో వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, మంజుల, మల్లేశం, లత, నాగలక్ష్మీ, నర్సవ్వ పాల్గొన్నారు.

పురాతన శివాలయ అభివృద్ధి పనులకు భూమిపూజ



ఆలయంలో జీర్ణోద్ధరణ పూజలు చేస్తున్న గ్రామస్థులు

ముస్తాబాద్, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామంలో పూరాతన శివాలయ నిర్మాణ పనులకు (జీర్ణోద్ధరణ) ఆదివారం గ్రామస్థులు భూమిపూజ చేశారు. అతి పురాతన ఆలయమైన శివాలయం గ్రామస్థుల అందరి సహకారంతో అభివృద్ధి చేయడానికి గ్రామ నాయకులు ముందుకు వచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ అర్చకులు రుద్రమణి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు కో కన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ చిట్నేని అంజనేయరావు, విద్యాసాగర్‌రావు, శ్రీనివాస్‌రావు, ఎల్లాగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతు పనుల పరిశీలన

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో విద్యుత్ ఇబ్బందులు తొలగిపోతాయని సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. వర్షాల నేపథ్యంలో తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట, కస్బెకట్కూర్ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్, విద్యుతు స్థంభాలు కూలిపోవడంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఆదివారం పనులను సెస్ ఛైర్మన్ చిక్కాల రామారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లడి విద్యుత్ ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సెస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెస్ ఏఈ మధుకర్, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

అన్నదానానికి విరాళం

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అన్నదానానికి కోనరావుపేట మండలం కనగర్తి గ్రామానికి చెందిన అండే శంకర్ రెడ్డి జ్ఞాపకార్థం తన కుమారుడు అండే పరమేశ్వర్‌రెడ్డి ఒక లక్ష రూపాయల చెక్కును అదివారం ఆలయ పర్యవేక్షకులు సంజీవరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని ఖండించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని మేధావులు, విద్యావంతులు ఖండించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ప్రొఫెసర్ కే లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విద్యను వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను పోషిస్తున్నాయని ఆరోపించారు. విద్యా కమిషన్ల సిఫారసులను కాలదన్ని విద్యారంగానికి ఉద్దేశపూర్వకంగా ఏటేటా నిధులు తగ్గిస్తూ సౌకర్యాలను కల్పించడం లేదని విమర్శించారు. విద్యారంగాన్ని ప్రైవేటుపరం చేసే కుట్రపూరిత ఆలోచనలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నూతన జాతీయ విద్యా విధానం 2020 తీసుకువచ్చి దేశ లౌకిక, ప్రజాస్వామిక విలువలకు తిలోదకాలు ఇచ్చి విద్యను కాషాయీకరణ, కేంద్రీకరణ చేస్తున్నదని దీనిని ఉద్యమాల ద్వారా ప్రతిఘటించాలని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాన స్రవంతి పాఠశాలలను మెరుగుపరచకుండా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఇంటర్నేషనల్ స్కూల్స్ అంటూ అప్పులు తెచ్చి రూ. 24 వేల కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు చేయడం కాంట్రాక్టర్లకు వారి కమీషన్లకు ఉపయోగపడుతాయి తప్ప విద్యారంగానికి మేలు చేయవని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయకుండా పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహాధ్యక్షుడు వై అశోక్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చి కేవలం 7.3 శాతం కేటాయించడం సరికాదని తక్షణమే 20 శాతం నిధులు బడ్జెట్లో కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా జీడీపీలో ఆరు శాతం నిధులు, బడ్జెట్‌లో 10 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి ఎం. రఘుశంకర్‌రెడ్డి, కమిటీ రాష్ట్ర కార్యదర్శి కే రవిచందర్ మాటాడుత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుమాల రామనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మానవ హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కమిటి సభ్యుడు నాగభూషణం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా సభ్యుల సమావేశం జరిగింది. ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల, జిల్లా కమిటీలపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించామన్నారు. ప్రధానంగా సమావేశంలో జిల్లా, మండలాల నూతన కమిటీలు వేయడంపై చర్చించడం జరిగిందన్నారు. మానవ హక్కు లకు భంగం కలిగినప్పుడు ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్, కుసుమ గణేష్, చిప్ప దేవదాస్, మడికొండ శ్రీనివాస్, వెంగళ వెంకటేశం పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో అర్హులైన ప్రతి పేద కు సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలం మల్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ పథకంలో నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరై ప్రారంభించారు. ఇంటిని నిర్మించుకున్న ఐల శివరాం దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కారు ఒక్కొక్కటి నెరవేరుస్తోందని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు పాటు పడుతోందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, ప్యాక్స్ ఛైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి, 'సెస్' డైరెక్టర్ కోటపల్లి సుధాకర్, ఏఎంసీ ఛైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీంరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, నాయకులు కొడగాని వెంకటేశ్, నాగుల వంశీ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల క్రీడలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) :ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకొని ఈ నెల 30 నుంచి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి దివ్యాంగుల క్రీడలను విజయవంతం చేయాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డిసెంబరు 3న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంను పురష్కరించుకొని జిల్లా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుండి జిల్లా స్థాయిలో దివ్యాంగులకు వివిధ క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబరు 3 ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలలో భాగంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడలలో విజేతలకు బహుమతుల ప్రదానం, కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ, మధ్యాహ్నం అన్నదానంతో పాటు దివ్యాంగులకు ఉచితంగా బట్టల పంపిణీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు చీకోటి అనిల్‌కుమార్, అధ్యక్షురాలు ఆకుల సంధ్య, ఉపాధ్యక్షుడు జవ్వాజి అమర్నాథ్, సహాయ కార్యదర్శి అంబటి శ్రీనివాస్, కోశాధికారి ఉరగొండ లత, సభ్యులు మిట్టపల్లి రమేష్, వెల్ది గణేష్, గవ్వలపెల్లి సుజాత పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల కార్తీక వనభోజనాలు



ప్రభుత్వ విప్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

వేములవాడ టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారంలోని శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో జిల్లా ఆర్యవైశ్య మిత్రమండలి సిరిసిల్ల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ వనభోజనాలకు హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆర్యవైశ్య మిత్రమండలి ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పూజలు చేశారు. కార్తీకమాసం సందర్భంగా అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్‌కు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదం అందజేశారు.

అథ్లెటిక్స్ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ ఉమెన్ త్రూ యాక్షన్(అస్మిత) మహిళ లీగ్ రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ భారతదేశంలోని 26 రాష్ట్రాల నుంచి 300 జిల్లాలను ఎంపిక చేసి అందులో బాలికలను అండర్ - 14, అండర్ - 16 విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు ఈ నెల 24 జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ప్రధానంగా రన్నింగ్, డిస్కస్ త్రో, జావలిన్ త్రో, షాట్‌పుట్ క్రీడలను నిర్వహించడం జరు గుతుందన్నారు. పోటీలలో పాల్గొనే బాలికలు వివరాలకు సెల్ : 7901464456, 9441456385 నెంబర్లను సంప్రదించి ఎలాంటి రుసుం లేకుండా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గొట్టె రాందచంద్రం, కోశాధికారి వినోద్ ఉన్నారు.

చెరువులో చేపపిల్లలను వదిలిన నాయకులు



చెరువులో చేప పిల్లలను వదులుతున్న నాయకులు

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామ శివారులోని చంద్రవంక చెరువులో చేప పిల్లలను నాయకులు వదిలారు. జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ పర్శరాములు, కార్యదర్శి సంతోష్, నాయకులు కనకయ్య, ఆంజయ్య, లక్ష్మణ్, శ్రీనివాస్, సర్వయ్య, రాజేశం, రాజు, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చందుర్తి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన పల్లి రవిగౌడ్ అనే గీతకార్మికుడు శనివారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పై నుంచి జారిపడి గాయపడ్డాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. రవి రోజు మాదిరిగానే తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవ శాత్తు మోకుజారి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు గమనించి రవిని చికిత్సనిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ బస్టాండ్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలవగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం మండలంలోని ఆముదాలపల్లికి చెందిన కందుల రాజు తిమ్మాపూర్‌లో పెళ్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో తాడికల్ బస్టాండ్ వద్ద అదే గ్రామానికి చెందిన అన్వర్‌పాషా రోడ్డు క్రాస్ చేస్తుండగా రెండు బైకులు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో రాజుకు ఎడమ కాలు విరిగింది. అన్వర్‌పాషాకు కుడి కాలుకు గాయమైంది. గమనించిన స్థానికులు 108వాహనంలో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి శివారులో గుర్తు తెలియని ఓ వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి గ్రామంలో రోడ్డుపై ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తితో పాటు గుర్తు తెలియని కారు గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

పాఠశాలలో కూరగాయల తోటలు



పాఠశాలలో సాగు చేసిన కూరగాయల మొక్కలు

- తల్లిదండ్రుల సహకారంతో నిర్వహణ
- ఫలితాలిస్తున్న విటమిన్ గార్డెన్లు

గంగాధర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోషకాహార కూరగాయల సాగుకోసం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న విటమిన్ గార్డెన్లు సత్ఫలితాలనందిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో ఏర్పాటు చేసిన గార్డెన్లలో నాటిన మొక్కలు నేడు కాతకొచ్చాయి. గంగాధర మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ఆదేశాలతో విటమిన్ గార్డెన్లు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నాటిన కూరగాయల మొక్కలు కొన్ని పాఠశాలలో కోతులు ధ్వంసం చేస్తుండగా గర్షకుర్తి పాఠశాలలో మాత్రం కూరగాయలు కోతకొస్తున్నాయి.



మొక్కకు నీరు పోస్తున్న విద్యార్థినులు

విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం

ఇక్కడి పాఠశాలలో గార్డెన్ నిర్మించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఉంది. ఉపాధ్యాయులు పాఠశాల వెనకాల ఖాళీ ప్రదేశంలో విటమిన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు మొక్కలకు కావలసిన పోషకాలనందించేందుకు ప్రత్యేకంగా మట్టిని ట్రాక్టర్లతో తెప్పించారు. తెచ్చిన మట్టిని తల్లిదండ్రులే గార్డెన్‌లో పోశారు. కూరగాయల గార్డెన్‌లో నాటిన మొక్కల సంరక్షణను ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరిస్తూ వాటికి నీరందిస్తున్నారు. పాఠశాల ముగిసే సమయంలో వాటిని కాపాడేందుకు చుట్టు ట్రీగార్డ్స్‌ను రక్షక కవచంగా ఏర్పాటుకు ఉపాధ్యాయులు సొంత ఖర్చులను వెచ్చించారు. ఇక్కడి గార్డెన్‌లో బచ్చలి కూర, పాలకూర, టమాట, కొత్తిమీర, వంకాయ, సోర, మెంతి, కాలిఫ్లవర్, మునగ వంటి కురగాయల మొక్కలను నాటారు. ఈ మొక్కలను ప్రత్యేకంగా కరీంనగర్ నుంచి తీసుకొచ్చి పెంచుతున్నారు. ప్రస్తుతం బచ్చలికూర, పాలకూర, టమాట, కొత్తిమీర కోతకు వచ్చింది. ఉపాధ్యాయులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం తయారు చేసుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తు మొక్కలను కాపాడుతున్నారు.

విద్యుత్ కార్యాలయంలో ఉద్యోగుల మందు పార్టీ

- ముగ్గురి సస్పెన్షన్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్‌ఉద్యోగులు శనివారం రాత్రి మందుపార్టీ చేసుకున్న వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో స్పందించిన విద్యుత్ ఉన్నతాధికారులు ఆదివారం ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్‌చేశారు. జగిత్యాలసర్కిల్ కార్యాలయంలో టౌన్-1 సెక్షన్ కార్యాలయ ఓయం స్టాఫ్‌రూంలో శనివారం అసిస్టెంట్ లైన్‌మెన్లు ప్రభాకర్, బాలకృష్ణ, రాజశేఖర్ మందు పార్టీ చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయ్యింది. వారిని సస్పెండ్ చేసినట్లు జగిత్యాల డివిజనల్ ఇంజనీర్ గంగారాం తెలిపారు. ఈ ఘటనపై సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 17సర్కిళ్లలోని అన్ని సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ సంస్థ కార్యాలయాలు విద్యుత్ సంస్థ కార్యాలయాల్లో క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా..

మానకొండూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్‌లోని స్థానిక పెద్ద చెరువు ప్రాంతంలో ఆదివారం లారీ ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడింది. ఐతరాజుపల్లి నుంచి శంకరపట్నం మండలంలోని మొలంగూరుకు సీడ్ వరి ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ వెనకాల నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్‌కు ప్రమాదం తప్పింది. ధాన్యం బస్తాలు రోడ్డు వెంట పడిపోవడంతో స్థానికుల సహాయంతో బస్తాలను రోడ్డు పక్కకు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలకులు మారుతున్నా ప్రజల బతుకులు మారలేదు

- ఎజెండాలతో కాకుండా ఎర్రజెండాతో పోరాడుదాం
- సీపీఐ నాయకులు చాడ వెంకటరెడ్డి



ఎడ్ల బండిపై సీపీఐ రాష్ట్ర నాయకుడు చాడ వెంకటరెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో పాలకులు మారుతున్నా ప్రజల బతుకులు మాత్రం మారడం లేదని సీపీఐ సీనియర్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సీపీఐ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కొమురం భీం జిల్లా నుంచి ప్రారంభమైన కళాజాతా ఆదివారం రాత్రి వేములవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో డిసెంబరు 26, 1925న పుట్టిన పార్టీ సిపిఐ అని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకే వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను కాలరాసి రైతులు, కార్మికులు నిరసన తెలిపే హక్కు లేకుండా చేశారని విమర్శించారు. దేశంలో ఇంకా కూడు, గుడ్డ కోసం నిరుపేద ప్రజలు తల్లాడుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎజెండాలను పక్కన పెట్టి ఎర్రజెండాను పట్టి హక్కులను సాధించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. డిసెంబరు 26న ఖమ్మం జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో కోరుట్ల బస్టాండ్ నుంచి తిప్పాపూర్ వరకు ఎడ్ల బండి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు కడారి రాములు, మారుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విషమంగా అశ్రిత్ ఆరోగ్య పరిస్థితి

- అర్చన మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి
- కూల్‌డ్రింక్ బాటిల్ సీజ్
- పోలీసుల అదుపులో మల్లేశం?

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు అనవేని అశ్రిత్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. కరీంనగర్‌లోని వావిలాలపల్లిలో శనివారం సాయంత్రం అంగవైకల్యంతో ఉన్న అర్చన(15), అశ్రిత్(17) ఇంట్లో అపస్మారకస్థితిలో ఉండగా తల్లి పోషవ్వ గమనించి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అప్పటికే అర్చన మరణించగా, అశ్రిత్ చికిత్స అందిస్తున్నారు. తల్లి పోషవ్వ మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇద్దరు పిల్లలు స్పృహ కోల్పోయి ఉండడం, ఆమె భర్త మల్లేశం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తండ్రే కూతురు, కొడుకును హత్యచేసేందుకు ప్రయత్నించాడా? అనిపోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నా నిర్ధారించ లేకపోతున్నారు. సంఘటన జరిగిన ఇంటిలో ఒక కూల్‌డ్రింక్ బాటిల్‌తోపాటు మరికొన్ని ఆధారాలను పోలీసులు సేకరించారు. కూల్‌డ్రింక్‌లో విషం కలిపి ఇద్దరు పిల్లలచేత తాగించాడా? లేదా గొంతునులిమి హత్య చేశాడా? మరే కారణమనేది వారితండ్రి మల్లేశం పట్టుబడితేగానీ తెలియని పరిస్థితి నెలకొందని, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తరువాతనే నిర్ధారణ అవుతుందని త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. అర్చన గొంతు వద్ద గాయాలను పోలీసులు గుర్తించారు. అర్చన మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం పూర్తిచేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం రాత్రి మల్లేశంను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

ఆవులను ఎత్తుకెళ్లిన దొంగలు

గన్నేరువరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్‌లో శనివారం అర్ధరాత్రి గ్రామానికి చెందిన బండి కనుకయ్య, న్యాలపట్ల ఎల్లయ్య, సుదగోని మహేందర్, పంబాల కొమురయ్యకు చెందిన నాలుగు ఆవులను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు ఆవులను పశువుల పాకలో కట్టేసి ఉంచారు. దొంగలు ఆవులను వాహనంలో ఎక్కించి అపహరించారు. ఒక్కో ఆవు ధర సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేందర్ రెడ్డి తెలిపారు.

నగదు అపహరణ

ఇల్లంతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన బుర్ర బాలయ్య ఇంట్లో దొంగలుపడి బీరువాలోని రూ.50 వేల నగదును అపహరించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. బాలయ్య గ్రామపంచాయతీలో పనిచేస్తుండగా అతనిభార్య కూలీపనులకు వెళ్లింది. శనివారం ఇంటికి ఉన్న తాళంతీసిన దొంగలు నగదును ఎత్తుకెళ్ళారు. దొంగలుపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎస్సై సిరిసిల్ల అశోక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

విద్యుత్ మోటార్ కేబుల్ చోరీ

ఓదెల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం రాత్రి నలుగురు రైతులకు చెందిన 80 మీటర్ల విద్యుత్ మోటార్లకు ఉండే రాగివైర్ చోరీకి గురయ్యింది. గూడెంలో బుడిగె సతీష్ 30 మీటర్లు, వీరముష్టి శ్రీనివాస్ 25మీటర్లు, బుడిగె కుమారస్వామికి చెందిన 20మీటర్లు, గుంపులకు చెందిన మరో రైతు సల్లాల ప్రశాంత్‌కు చెందిన 25మీటర్లు మొత్తం 80 మీటర్ల రాగి వైర్ గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం నారుమడులు సిద్ధం చేసుకునే సమయంలో రాగివైర్లను దొంగిలించడంతో రైతులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్క మోటార్‌కు ఉన్నవైరు మళ్లీకొనుగోలు చేయాలంటే రూ.3500నుంచి రూ.4వేల వరకు ఖర్చవు తుందని రైతులు పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ



ట్రాన్స్‌ఫార్మర్‌లో సామగ్రిని ఎత్తుకెళ్లిన దొంగలు

చొప్పదండి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో కాట్నపల్లి ఫీడర్ పరిధిలోని ఎస్ఎస్-5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని సామగ్రి తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం గమనించిన రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు.

ప్రమాదాలకు నిలయంగా మూల మలుపులు

- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాల్లో 20 మంది మృతి



కథలాపూర్ శివారులో ఉన్న ప్రమాదకర మూల మలుపు



పోసానిపేట ఎల్లమ్మ గుడి వద్ద మూల మలుపు

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని పలు రహదారుల మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వేములవాడ-కోరుట్ల రహదారిపై కథలాపూర్, పోసానిపేట శివారుల్లో అత్యంత ప్రమాదకరంగా ఉన్న మూల మలుపుల దగ్గర నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఏ వాహనం దూసుక వస్తుందనే విషయం తెలియక అనేకమంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారు.

సూచికల ఏర్పాటులో నిర్లక్ష్యం..

ఈ మూలమలుపుల వద్ద లారీలు, బస్సులు, ద్విచక్రవాహనాలు, టిప్పర్లు ఢీకొట్టిన ఘటనల్లో ఇప్పటికే దాదాపు 20మంది ప్రాణాలు వదిలినట్టు స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ రోడ్డు మరియు భవనాల శాఖ అధికారులు ఇప్పటికీ మూల మలుపులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వారినిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. ఏటేటా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతుంటే ప్రమాదాల నివారణపై ఎందుకు శ్రద్ధచూపడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. వేములవాడ-కోరుట్ల రహదారిపై ప్రతీనిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వేములవాడకు శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి ఈ రోడ్డు వెంటే భక్తులు వెళ్తుంటారు. ఈ మధ్య కాలంలో మూలమలుపుల వద్ద మరణిస్తున్న వారి సంఖ్య పెరిగింది. కాగా పోలీసులు సంఘటనలు జరిగిన సందర్భాల్లో తాత్కాలికంగా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేస్తుండడం పరిపాటిగా మారుతోంది.

ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

– అజారోద్దీన్, జూనియర్ అసిస్టెంట్, ఆర్‌డీవో కార్యాలయం, మెట్‌పల్లి



ప్రతీదినం ఈ రోడ్డుపై కార్యాలయంకు వెళ్ళి వస్తుంటాను. మూల మలుపుల వద్దకు రాగానే భయపడాల్సి వస్తోంది. ఏ వాహనం రూపంలో వచ్చి మృత్యువు కబళిస్తుందని ఆందోళన తప్పడం లేదు. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

హైలెవెల్ బ్రిడ్జిగా మార్చాలి..

– ఎంజీ రెడ్డి, మాజీ సర్పంచ్, పోసానిపేట



పోసానిపేట ఎల్లమ్మ గుడి వద్ద ఉన్న మూల మలుపు వద్ద చాలాసార్లు ప్రమాదాలు జరిగి అనేక మంది మరణించారు. అదే ప్రాంతంలో లోలెవెల్ కల్వర్టు ఉండడంతో ప్రమాదాలకు మరింత ఆస్కారం ఏర్పడుతోంది. అక్కడ హైలెవెల్ వంతెన నిర్మించి ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

పాముకాటుతో మహిళా రైతు మృతి



రమాదేవి(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన మహిళారైతు సుదాటి రమాదేవి(50) పాముకాటుతో మృత్యువాతపడింది. మృతురాలి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. ఆదివారం సుదాటి రమాదేవి పొలాన్ని హార్వెస్టర్‌తో కోయిస్తోంది. ఈ క్రమంలో అక్కడక్కడ మిగిలిపోయిన వరికర్రలను కొడవలితో కోస్తుండగా ప్రమాదవశాత్తు పాముకాటు వేసింది. వెంటనే ఆమెను కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త సుదాటి సత్యనారాయణరావుతో పాటు కుమారుడు మాజీఉపసర్పంచ్ సుదాటి కరుణాకర్‌రావు, కూతురు కర్ణ ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే రమాదేవి మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



లింగం(ఫైల్)

చందుర్తి నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో విద్యుదాఘాతంతో ఆదివారం ఓ రైతు మృతిచెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంబిరీ లింగం(65) అనేరైతు ఇంటి నుంచి మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లాడు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలం దగ్గరకు వెళ్లిన తండ్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుమారుడు పూర్ణచందర్ పొలం వద్దకు వెళ్లి చూడగా, మోటార్ స్టార్టర్ బాక్స్ వద్ద పడి ఉన్నాడు. వెంటనే స్థానికంగా ఉన్న రైతులను పిలిచి వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య తార గత కొన్ని సంవత్సరాల క్రితం బెజ్జంకి మండలంలో జరిగిన రోడ్డు ప్రమా దంలో మృతి చెందింది. కుమారులు పూర్ణచందర్, రాజు, కూతురు సంపూర్ణ ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు ఏఎస్ఐ ఆనంద్ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల శివారులోని మానేరు నదిలో దూకి చింతకింది సోమయ్య(55) అనేవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం..సిరిసిల్ల పట్టణం ఆశోక్‌నగర్‌కు చెందిన సోమయ్య పవర్‌లూం కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నెల రోజుల క్రితం కంటి ఆపరే షన్ కాగా సరైన ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన సోమయ్య మానేరు నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం సోమయ్య మృతదేహాన్ని మానేరు నదిలో చూసిన జాలర్లు పోలీసులకు సమాచారం అందించారు. అనారోగ్యంతో పాటు ఉపాధిలేక ఆర్థికఇబ్బందులతో మనస్థాపం చెంది సోమయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య వాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘ టనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంతోషంగా వచ్చి.. విగత జీవిగా మారి



శివాసిని(ఫైల్)

సుల్తానాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటున్న పెద్దమ్మకొడుకు సోదరుడిని తీసుకెళ్లడానికి పెద్దమ్మ, నాన్నమ్మతో కలిసి వచ్చిన బాలిక రోడ్డుప్రమాదంలో మృతిచెందిన ఘటన ఆదివారం సుల్తానాబాద్‌లో చోటుచేసుకుంది. జగిత్యాలజిల్లా బీర్పూర్ మండలం తొంగురు గ్రామానికి చెందిన రాణి, అత్త లక్ష్మితో కలిసి పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్‌లో చదువుకుంటున్న కొడుకు శ్రావణ్ వద్దకు వెళ్లడానికి సమాయత్తమయ్యారు. వారివెంట వస్తానని రాణి మరిది కిషోర్ కూతురు శివాసిని(8) కోరగా ఆమెనుకూడా వెంట తీసుకొని ముగ్గురు సుల్తానాబాద్ చేరుకున్నారు. హాస్టల్‌లో చదువుకుంటున్న రాణి కొడుకు శ్రావణ్‌ను కలిసి మళ్లీ స్వగ్రామానికి వెళ్దామని హాస్టల్ నుంచి సమీపంలోని రాజీవ్‌రహదారి వద్దకు వచ్చారు. పెద్దపల్లి వైపు బస్సు ఎక్కేందుకు రోడ్డు దాటేయత్నంలో శివాసిని కరీంనగర్ వైపు నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో శివాసిని ఎగిరి రోడ్డుపై పడటంతో అక్కడిక్కడే మృతిచెందింది. మృతురాలి తండ్రి కిషోర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి బాలిక మృతి

పెద్దపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లి గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మారం మండలం బొట్లవనపర్తికి చెందిన కత్తెర్ల లక్ష్మణ్, భార్య ఇద్దరు కూతుళ్లతో పెద్దపల్లికి వచ్చాడు. అనంతరం ఇంటికి వెళ్తున్న క్రమంలో కాసులపల్లి వద్ద రోడ్డుపై ఉన్న గమనించక బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. పెద్ద కూతురు సాయి పావని (13) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాలిక మృతదేహాన్ని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

సుల్తానాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకల్వల వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాపెల్లి రాజేశం(80) అక్కడిక్కడే మృతి చెందాడు. రాజేశం రోడ్డు పక్కన ఉన్న ఇంట్లోని చెత్తను రోడ్డు అనుకుని ఉన్న డంపులో పారబోసి, తిరిగి ఇంట్లోకి వెళతుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు అతివేగంతో వస్తున్న టీఎస్22జె6966 కారు ఢీ కొట్టింది. దీంతో రాపెల్లి రాజేశం ఎగిరి కొంతదూరంలో రోడ్డుపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు. సమాచారం అందుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తిలోని హోటల్ లివింగ్ ట్రీలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం పట్టుకున్నట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. వారి వద్ద నుంచి 38,060 రూపాయల నగదుతోపాటు ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఘనంగా కేతేశ్వర-కంకాలమ్మ జాతర

కథలాపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం అంబారిపేటలో ఆదివారం శ్రీకేతేశ్వర సహిత కంకాలమ్మ జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక మేదరి సంఘం అధ్వర్యంలో గ్రామ శివారులో ఉన్న స్వామి సన్నిధిలో భక్తులు స్వామివారల దర్శనానికి భక్తులు బారుల తీరారు. చుట్టు పక్కన గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహిళలు స్వామివారికి బోనాలతో నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మేదరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మహిళలు

పరుగు పోటీలో..
జాతీయ స్థాయికి ఎంపికైన ఆనంది



జాతీయ స్థాయికి ఎంపికైన నల్లవెల్లి ఆనంది

కమాన్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని నల్లవెల్లి ఆనంది అండర్17 విభాగంలోని 800, 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నల్లవెల్లిశంకర్, భారతిల రెండోవ కుమార్తె ఆనంది గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. గతంలో ఒడిశా రాష్ట్రరాజధాని భువనేశ్వర్‌లోని కళింగస్టేడియంలో నిర్వహించిన 40వ జాతీయచాంపియన్‌షిప్ అండర్16 విభాగంలో మూడోస్థానంలో నిలిచి బ్రౌంజ్‌మెడల్ సాధించింది. వచ్చే నెలలో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో ఆనంది పాల్గొంటారు. ఆమె ఎంపికపై ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు అభినందించారు.

రాజన్న ఆలయ దక్షిణ ప్రాకారం కూల్చివేత


రాజన్న ఆలయంలో ముమ్మరంగా సాగుతున్న విస్తరణ పనులు


వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపనుల్లో భాగంగా 46ఏళ్లచరిత్ర కలిగిన ఆలయం చుట్టూ ఉన్న దక్షిణంవైపు ప్రాకారం కూల్చివేత పూర్తయింది. ఇదే ప్రాంతంలోని కోటిలింగాలను తొలగించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇందుకు శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతిస్వామి అనుమతించారు. అంతకు ముందు ఒకసారి పురాతన ప్రాకారం తొలగించి 1979లో పునరుద్ధరించారు. అపుడు దాదాపు ఏడాదిపాటు నిర్మించిన ఈ ప్రాకారాన్ని విస్తరణలో భాగంగా రెండోసారి తొలగించాల్సి వచ్చింది. ఆలయం చుట్టూ ఇరుకుగా లేకుండా ఉండేందుకు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నూతన ప్రాకారం నిర్మించడానికి రూపకల్పన చేశారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి యోగా పోటీలు


యోగాసనాలు వేస్తున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14,-17 యోగాపోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ ఫెయిర్, ఆర్టిస్టిక్ ఫెయిర్ విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ట్రెడిషనల్ అండర్-17 బాలికల విభాగంలో సహస్రలక్ష్మి(కరీంనగర్), ఎ.తనిష్క(వరంగల్), బి.శిరీష(నిజామాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో టి.హరీష్ బాలాజీ(కరీంనగర్), పి వినయ్‌కుమార్ (సిద్ధిపేట), మోయిన్ (రంగారెడ్డి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఆర్టిస్టిక్ సింగిల్‌అండర్-17 బాలికలవిభాగంలో బి.సవారతి (నిజామాబాద్), ఎం. స్వాతిక(మెదక్), ఎస్.మహేశ్వరి(ఆదిలాబాద్), బాలుర విభాగంలో ఎస్. రాంచరణ్(మెదక్), ఆర్.శశివర్ధన్(ఆదిలాబాద్), ఎ. విశాల్ (నిజామాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు గెలుపొందారు. ట్రెడిషినల్ అండర్-17 బాలికలవిభాగంలో సీహెచ్ సహస్ర (నిజామాబాద్), టి.కమలిని(కరీంనగర్), బి.సరిసమ(వరంగల్), బాలుర విభాగంలో ఎస్.సమన్విత్(వరంగల్), పి.అఖిల్(కరీంనగర్), శ్రీహరి ప్రసాద్(హైదరాబాద్) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరితోపాటు రిథమిక్ ఫెయిర్, ఆర్టిస్ట్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ నిర్వహణకార్యదర్శి బసబోయిన వేణుగోపాల్, రాష్ట్ర పరిశీలకులు టి సతీష్, ఎన్. శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజరాజేశ్వరి, నిర్వాహకులు వీర్ల హనుమంతరావు, వెలిచాల యూత్‌సభ్యులు,పీడీలు,పీఈటీలు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు భరోసా




- 11 నెలల్లో 39 మందికి ఆర్థిక సహాయం
- 63 కేసుల్లో న్యాయసహాయం, 43మందికి వైద్యసేవలు
- 11మందికి రూ.3.5లక్షల నష్టపరిహారం అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాధిత మహిళలకు కరీంనగర్ శివారులో ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం అండగా నిలుస్తున్నది. కమిషనరేట్ పరిధిలో మహిళలపై జరుగుతున్న వివిధరకాల నేరాల్లో బాధితులకు న్యాయ సహాయం అందిస్తోంది. సైబర్‌నేరాలపై మహిళలకు అవగాహన కల్పిస్తోంది. మహిళా బాధితుల్లో ఆత్మ విశ్వాసం నింపడం, లైంగిక, ఇతర రకమైన వేధింపులు, నేర ఘటనల్లో ఎలా?ఎవరికి? ఫిర్యాదు చేయాలి, ఎవరిని సంప్రదించాలి? అనే విషయాల్లో బాధితులకు భరోసా కేంద్రం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

అన్ని రకాల సమాచారం

భరోసా కేంద్రం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం పర్యవేక్షణలో నడుస్తున్నది. భరోసా కేంద్రంలో ఒక నిర్వహణాధికారి, ఇద్దరు కౌన్సెలర్లు, రిసెప్షనిస్టు, ఒక ఏఎస్ఎం, లీగల్ అడ్వైజర్ ఉంటారు. వీరంతా బాధితులకు కావాల్సిన అన్నిరకాల సమాచారంతో పాటు సహాయాన్ని అందిస్తారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో 2022 సంవత్సరంలో మహిళా బాధితులకు సంబంధించి 498 కేసులు నమోదుకాగా 2023 సంవత్సరంలో 565 కేసులు నమోదయ్యాయి.

- 2024 డిసెంబరు 22న కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వైద్యకళాశాల పక్కన ఈ భరోసా కేంద్రాన్ని అప్పటి డీజీపీ జితేందర్ ప్రారంభించారు. కోటి 70 లక్షల రూపాయలతో వెయ్యి చదరపు గజాల స్థలంలో 6,800 చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యంత ఆధునిక వసతులతో నిర్మించారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో భరోసా కేంద్రం, మొదటి అంతస్తులో షీటీమ్స్, రెండో అంతస్తులో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్ (మానవ అక్రమ రవాణా) విభాగాలు ఉంటాయి. గృహహింస, పోక్సో, సైబర్ వేధింపుల్లో మహిళా బాధితులకు సరైన న్యాయసహాయం అందించాలనే ధ్యేయంతో ఈ భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- 2024 డిసెంబరు నుంచి ఇప్పటివరకు 45 పోక్సో కేసులు, 25 లైంగిక వేధింపులు, మూడు ఇతర కేసుల్లోని బాధితులకు భరోసా సిబ్బంది న్యాయ సహాయం చేశారు. 59 కేసుల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 180ప్రకారం, 54 కేసుల్లో బాధితుల నుంచి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 183ప్రకారం స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. 43 మందికి వైద్య సహాయం అందించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నష్టపరిహారం కోసం 39మంది బాధితుల తరఫున దరఖాస్తులు సమర్పించగా, ఇప్పటివరకు 11 మంది బాధితులకు మూడు లక్షల యాభై వేల రూపాయలు అందజేశారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు

- జిల్లా విద్యాధికారి రాము
- ఘనంగా అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో రాము, డీవైఎస్‌వో రవి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఆలోచనా శక్తి పెంపొందుతుందని జిల్లా విద్యాధికారి రాము, జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం స్థానిక అకడమిక్ హైట్స్ పాఠశాలలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్ 17 బాల బాలికల చెస్ సెలక్షన్ టోర్నమెంట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలకు జిల్లా విద్యాధికారి రాము, జిల్లా యువజన క్రీడల అధికారి రవికుమార్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ చెస్ ద్వారా విద్యార్థులకు ఆలోచనాత్మక శక్తితో పాటు, మానసిక ఉత్తేజం సిద్దిస్తుందన్నారు. జగిత్యాల జిల్లాను క్రీడల పరంగా ముందు వరుసలో ఉంచేందుకు ఎల్లవేళలా తమవంతు తోడ్పాటును అందిస్తామని తెలిపారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చక్రధర్‌రావు మాట్లాడుతూ మొదటిసారిగా జగిత్యాల జిల్లాలో చెస్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ టోర్నమెంట్‌కు ఉమ్మడి 10 జిల్లాల నుంచి 100మందికి పైగా క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. ఈ పోటీల్లో ఐదుగురు బాలురు, ఐదుగురు బాలికలు ఎంపికవగా, త్వరలో జాతీయ స్థాయిలో జరగబోయే చెస్ టోర్నీకి ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పీఈటీలు విశ్వప్రసాద్, రాజమల్లయ్య, శ్రీనివాస్, రిఫరీ మల్లయ్య, చీఫ్ ఆర్బిటార్ అనిల్, జిల్లాకు చెందిన పలువురు పీఈటీలు, పాఠశాల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తజన సందడి

- వేములవాడ, ధర్మపురిలో భక్తుల రద్దీ
- ధర్మపురిలో వైభవంగా గోదావరి హారతి


వేములవాడలో భీమన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన భీమేశ్వరాలయంలో భక్తజనసందడి నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భీమేశ్వరాలయంలో భక్తులు కోడెల మొక్కులు చెల్లించి అన్నపూజ, అభిషేకం పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన సత్రంపై నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతాలు చేయించుకున్నారు.

● బద్దిపోచమ్మకు బోనాలు..

రాజన్న సన్నిధిలో స్వామివారి దర్శించుకున్న భక్తులు శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆదివారం శ్రీబద్దిపోచమ్మ ఆలయంలో అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించేందుకు బారులు తీరారు. ఆలయంలో వేలాదిమంది భక్తులతో రద్దీ ఏర్పడింది. భీమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవంలో భాగంగా సుహాసినులు దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు.

● నరసింహుడి క్షేత్రంలో..

ధర్మపురి : కార్తీకమాసం సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. దీంతో క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం తోడుగా సెలవు దినం కావడం వల్ల ఉదయం వరకు సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణ దారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు అభిషేకం, నిత్య పూజలు జరిపారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.


ధర్మపురిలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


గోదావరి నది వద్ద హారతి పూజలు

● ఘనంగా గోదావరి హారతి

ధర్మపురి వద్ద ఆదివారం గోదావరి హారతి ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, భక్తులు పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్ర స్థాయి
స్విమ్మింగ్ పోటీలు

రామగిరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలను రామగిరి మండలంలో నిర్వహించనున్నారు. 69వ ఎస్‌జీఎఫ్ అండ్14 బాల, బాలికల రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు ఈ నెల 17 నుండి 19 వరకు స్థానిక రాణిరుద్రమాదేవి క్రీడాప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కనుకుంట్ల లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో తెలంగాణ ఉమ్మడి పది జిల్లా నుంచి సుమారు 520 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను తెలం గాణ జట్టుకు ఎంపిక చేసి వచ్చే నెలలో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ నెల 18న ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

జగిత్యాల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం వరద నీరు స్వల్పంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోవస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501టీఎంసీల నీరునిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్‌భగీరథ, వరదకాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 9,454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8వేలక్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు విడుదల అవుతోంది.

సమస్యల వలయంలో నాయకపుగూడెం

- కనీస వసతులు లేక గిరిజనుల ఇక్కట్లు
- నిర్మాణానికి నోచుకోని మురికి కాలువలు, సీసీ రోడ్లు
- తాగు నీటికి తిప్పలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

బీర్‌పూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం కండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోకి వచ్చే నాయకపుగూడెంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గూడెంలో సీసీ రోడ్లు, మురికి కాలువలు లేవు. గూడెంలో 60 కుటుంబాలు, 180 మంది జనాభా, 110మంది ఓటర్లు ఉన్నారు. నాయకపుగూడెం కండ్లపల్లి గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ప్రజలకు తాగునీరు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● అలంకారప్రాయంగా వాటర్‌ట్యాంక్

గూడెంలో రెండు చేతిపంపులు ఉంటే ప్రస్తుతానికి ఒక్క చేతిపంపు మాత్రమే పనిచేస్తోంది. దీంతో ఆ నీరు అన్ని కుటుంబాలకు సరిపోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పైపు లైన్లు వేసి ఇంటికో నల్లా కూడా ఏర్పాటుచేశారు. సమీపంలో ఒక వాటర్ ట్యాంక్ కూడా నిర్మించినా నీటికి కనెక్షన్ ఇవ్వలేదు. ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న తమ ఇళ్లకు పట్టాలు లేవని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాయకపుగూడెం అటవీ భూమి అని అందులో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇండ్లు కట్టడానికి అనుమతులు లేవని అటవీశాఖ అధికారులు అడ్డు పడుతున్నట్లు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ నల్లా

గిరిజన గూడెం అటవీ భూముల్లో ఉన్నప్పుడు పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలను ఎందుకు కట్టారని, ప్రజలకు నీటి సౌకర్యం అందించడం కోసం వాటర్ ట్యాంక్ ఎందుకు నిర్మించారని పలువురు గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణాలు చేపట్టినప్పుడు గుర్తుకు రాని అటవీ భూములు గిరిజనులు ఇళ్లు కట్టుకుంటేనే గుర్తుకు వస్తాయా అని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఇళ్లకు పట్టాలు ఇప్పించాలి..

- గోపిరాజన్న, నాయకపుగూడెం



అటవీ భూమి అంటూ అధికారులు ఇళ్లు కట్టుకోకుండా అడ్డు పడుతున్నారు. మేము ఎన్నో సంవత్సరాల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ప్రభుత్వం, అధికారులు మమ్ములను గుర్తించి మా ఇండ్లకు పట్టాలు ఇచ్చి గూడెంలో అభివృద్ధి పనులు చేయాలి.

● మా బాధలు పట్టించుకోవాలి..

- పెరుమండ్ల మల్లవ్వ, నాయకపుగూడెం



60 కుటుంబాలకు రెండే బోరింగ్‌లు ఉన్నాయి. అందులో ఒక్కటి పని చేయడంలేదు. బడి దగ్గర ఒక్కటే పని చేస్తుంది. వాటర్ ట్యాంక్ కట్టి ఇంటికో నల్లా పెట్టినా ఒక్క రోజు కూడా నీళ్లు రాలేదు. నాయకులు, అధికారులు మా గూడెంలో బాధలను పట్టించుకోవాలి.

జర్మనీలో ప్రపంచ వ్యవసాయ సదస్సు

- పాల్గొన్న సిరిసిల్ల జిల్లా రైతులు

కోనరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అగ్రికల్చర్‌లో భాగంగా జర్మనీలో జరుగుతున్న ప్రపంచ వ్యవసాయ సదస్సుకు రాజన్న సిరిసిల్లజిల్లా రైతులు హాజరయ్యారు. కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు, మామిడిపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రైతులు ప్రపంచ వ్యవసాయసదస్సులో పాల్గొన్నారు. సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన రైతులను జర్మనీఇండియా ఎంబసీ అధికారులు అభినందించారు. ఆధునిక సాంకేతిక వ్యవసాయం, డేటా ఆధారిత వ్యవసాయ విధానాలు, ఏ-1సెన్సార్ టెక్నాలజీ వంటి అంశాలను నేర్చుకునేందుకు, వాటిని తెలంగాణలో అమలు చేయాలని రైతులు జర్మనీ రావడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ రైతులు చూపుతున్న ఆసక్తి భవిష్యత్ వ్యవసాయానికి దారితీసి కొత్త అవకాశాలను సృష్టిస్తుందని మెచ్చుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అగ్రిటెక్ మార్పుల్లో భారత రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ఎంబసీ అభినందించింది. వేములవాడ మాజీఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రపంచ వ్యవసాయ సదస్సులో పాల్గొన్న రైతులను అభినందించి తన ఇంటికి ఆహ్వానించి వసతి సౌకర్యం ఏర్పాటు చేశారని మండల రైతులు తెలిపారు.


జర్మనీలో వేములవాడ మాజీఎమ్మెల్యే రమేష్ బాబుతో కోనరావుపేట రైతులు

హైమాస్ట్ లైటు ప్రారంభం


హైమాస్టు లైటు ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని శివకేశవ స్వామి ఆలయం ఎదుట చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటును స్థానిక నాయకులు ఆదివారం ప్రారంభించారు. ఇటీవల ఆలయ పునర్నిర్మాణాన్ని చేపట్టిన ఆలయ కమిటీ సభ్యులు విద్యుత్తు దీపాల ఏర్పాటుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సత్యంకు విన్నవించారు. స్పందించిన ఆయన తన స్వంత ఖర్చులను హైమాస్ట్ లైటు ఏర్పాటుకు వెచ్చించారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 'సెస్' డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు వసంత్‌కుమార్, నర్సింహారెడ్డి, కిషన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల పూజ మహోత్సవాలు ప్రారంభం


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న స్వాములు

ఎల్లారెడ్డిపేట, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మండల పూజ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శ్రీనుగురుస్వామి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, గణపతి హోమం, సుబ్రహ్మణ్యస్వామి పూజ, అయ్యప్పస్వామికి అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వాములు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముస్తాబాద్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. కొండాపూర్‌లో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-2009 సంవత్సరంలో పదవతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యా ర్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించి మోమెంటో అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, ఆనందం, రాజలింగం, శ్రీనివాస్, రమేశ్, కిరణ్, విద్యార్థులు మహేశ్‌యాదవ్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న రామస్వామి

ఇల్లంతకుంట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా ఎలుక రామస్వామిని నియమిస్తున్నట్లు మండలశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపెల్లి గ్రామానికి చెందిన రామస్వామి గతంలో పలు బాధ్యతలు నిర్వహించారు. మనకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో ఆదివారం నియామక పత్రాన్ని అందుకున్నాడు. పార్టీ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే సూచించినట్లు, తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యేలతో పాటు మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కొనరావుపేట, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామనికి చెందిన కుడుకల సిద్దయ్యకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆదివారం అందజే శారు. గ్రామానికి చెందిన సిద్దయ్య అనారోగ్య కారణాల వల్ల ఆసుపత్రిలో చికిత్స చేయిం చుకుని సీఎం నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 23 వేల ఐదు వందల రూపా యల చెక్కును పల్లిమక్త బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు జిన్నా అనిల్ కుమార్ లబ్ధిదా రునికి అందచేశారు.

నిరుపేదలకు వైద్యం అందించడం హర్షనీయం


పెద్దూర్‌లో మందులను అందిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు వైద్య పరీక్షలుచేసి ఉచితం గా మందులను పంపిణీ చేయడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామంలో ఆదివారం వార్డు కార్యాలయంలో వంశీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని కేకే మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసి వైద్యశిబిరంలో డాక్టర్ వంశీధర్‌గౌడ్, డాక్టర్ కపిల్ గౌడ్‌లు ప్రజలందరికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల తిరుపతిగౌడ్, బీసీ సెల్ నాయకులు గోపాల్‌యాదవ్‌ంర, వార్డు ఉపాధ్యక్షుడు బడుగు భరత్, సల్లూరి సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

ముస్తాబాద్, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో సీపీఐ శత జయంతి ఉత్సావాల కరపత్రాలను సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు , సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మీసం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుంటి వేణు మాట్లాడుతూ సీపీఐ శత జయంతి ఉత్సావాల సందర్భంగా బస్సుజాతా ప్రారంభమైందని ఈ నెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు సిరిసిల్లలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు అనవేని భూదన్న, సీహెచ్ అంజయ్య, మల్లేశం, రజిత, లక్ష్మీ, అంజయ్య, అనురాధ, బాలవ్వ, గీత , అవని తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఒడిలో పోచమ్మతల్లి తల్లి ఆలయం

● గుట్టలు, పచ్చని చెట్ల మధ్య కొలువైన అమ్మవారు ● సౌకర్యాలు కల్పించాలని కోరుతున్న భక్తులు


గండ్లె పోచమ్మ ఆలయం


గండ్లె పోచమ్మ ఆలయానికి వెళ్లే దారి

ఇల్లంతకుంట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి రమణీయతల మధ్య కొలువైన గండ్లె పోచమ్మతల్లి భక్తులు నీరాజనాలు అందుకుంటోంది. చుట్టూ గుట్టలు, పచ్చని చెట్లు పక్కనే నిరతంరం పారే నీటిధారలతో ఆలయ ప్రాంగణం ఎంతో అహ్లాదంగా ఉంటుంది. ఇల్లంతకుంట మండలం ఒగులాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే గండ్లె పోచమ్మ ఆలయం మండల కేంద్రం నుంచి సిరిసిల్లకు వెళ్లే ప్రధానరోడ్డు పక్కనే ఉంటుంది. ఆలయానికి ప్రతి ఆదివారం, బుధవారం భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. జిల్లాలోని పలు మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆలయం పక్కనే పారే నీటిని తమ ఇళ్లకు భక్తులు తీసుకొనిపోతుంటారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ఉండటానికి షెడ్లను నిర్మించారు. భక్తుల సంఖ్య అధికం అవుతున్నందున సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుచున్నారు. నీటికోసం బోరుతో పాటు చిన్నపాటి ట్యాంకు మాత్రమే ఉంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే నీటికోసం ఇబ్బందిపడే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి పెద్దట్యాంకును నిర్మించాలని భక్తులు కోరుతున్నారు. గండ్లె పోచమ్మ ఆలయాన్ని పర్యాటక ప్రదేశంగా మార్చాలని కోరుతున్నారు.

సౌకర్యాలు పెంచాలి

- కముటం శ్రీకాంత్, వెల్జీపూర్



గండ్లె పోచమ్మ ఆలయానికి భక్తులు పెరుగుతున్నందున సౌకర్యాలను పెంచాలి. ప్రతి ఆదివారం, బుధవారం వందలాది మంది భక్తులు వచ్చి ఇక్కడే వంటలు చేసుకొని ఉంటున్నారు. ఆలయప్రాంగణంలో చిన్న వాటర్ ట్యాంకు మాత్రమే ఉంది. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు భక్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భక్తుల కోసం వేసిన షెడ్లు సరిపోవడం లేదు.

పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి

- గుండేటి ప్రశాంత్, ఒగులాపూర్



గండ్లె పోచమ్మ ఆలయం పచ్చని చెట్లు, గుట్టల మధ్యన ఉండటం వల్ల ప్రభుత్వం పర్యాటక ప్రదేశంగా గుర్తించాలి. సహజసిద్ధంగా ఏర్పడిన నీటిధార నిరంతరం పారుతుంటుంది. ఆలయానికి దగ్గరలోనే మధ్యమానేరు ఉంది. ఆలయం విశాలమైన స్థలంలో ఉండటంతో ఇక్కడికి వచ్చే భక్తులకు అనుకూలంగా ఉన్నది.

టెట్ టెన్షన్

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు టెట్ పరీక్షకు హాజరయ్యేలా జీవోలో సవరణ చేశారు.

ఈ నెల 29వ తేదీ వరకు

దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేశారు. శనివారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ మొదలైంది ఈ నెల 29వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే సంవత్సరం జనవరి 3 నుంచి 31 వ తేదీ వరకు ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు.

నిరుపేద యువతి వివాహానికి సాయం

ఇల్లంతకుంట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జిపూర్ గ్రామానికి చెందిన నలువాల నవ్యశ్రీ అనే నిరుపేద యువతి వివాహానికి బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి రూ. 10వేల విలువైన టేకు మంచాలను వితరణ చేశారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా నిరుపేద యువతుల వివాహం జరిగినా టేకు మంచాలను పంపిణీ చేస్తున్నట్లు తిరుపతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బొల్లారం ప్రసన్న, చిట్టాల శ్రీనివాస్, రవీందర్, వేణు, రమేష్, అశోక్, నాగరాజు, భూమేష్, మహేందర్, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో పూర్తిస్థాయి వసతులు కల్పించకముందే పంపిణీ చేయడంలోని ఆంతర్యం ఏమిటని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రశ్నించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఎన్నికల కోడ్ రావడం వల్ల పంపిణీ చేయలేదన్నారు. గ్రామసభల ద్వారా అర్హులైన వారి జాబితాను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో నుంచి కొంత మంది లబ్ధిదారులను తొలగించి అనర్హులకు పంపిణీ చేశారనే ఫిర్యాదులు అందుతున్నాయని పేర్కొన్నారు. డబుల్‌బెడ్‌రూంల వద్ద కాకుండా రైతువేదికలో ఎందుకు పంపిణీ చేశారని ప్రశ్నించారు. అర్హులైన వారికి ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో పనిచేసే వారికి ఇచ్చినట్లు విమర్శించారు. ఇల్లంతకుంటలో ఆరుగురు అనర్హులకు ఇచ్చినారనే ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ సమగ్రమైన విచారణ జరిపి అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, నాయకులు చెరుకుపల్లి రాజిరెడ్డి, గొడుగు తిరుపతి, సాదుల్, మల్లెంకి శ్రీనివాస్, కూనబోయిన రఘు, ఆరె కొమురయ్య, ర్యాగటి రమేష్, సావనపెల్లి అనీల్‌కుమార్, ఎడ్ల ప్రశాంత్‌రెడ్డి, గుర్రం తిరుపతిరెడ్డి, అంతగిరి భాస్కర్, ప్రశాంత్, దొంతుల శంకర్, కార్తీక్ పాల్గొన్నారు.

గంజివాగు వంతెన పనులు పూర్తి చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

బోయినపల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే రహదారి మార్గంలో గంజి వాగుపై నిలిచిపోయిన హైలెవల్ వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతూ బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామస్థులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను వివరించారు. వంతెన నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే పనులను వేగవంతం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీలు అక్కెనపల్లి ఉపేందర్, కొట్టెపల్లి లింగం, మాజీ సర్పంచ్ అక్కెనపల్లి రాజయ్య, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రగిరి వెంకటేశ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు తునికి తిరుమలేశ్, నాయి బ్రహ్మణ సంఘం అధ్యక్షుడు తంగళ్లపల్లి సంతోష్, రాచర్ల రాజేశం, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు కాసారం మల్లేశం, పులి నారాయణ, రజక సంఘం అధ్యక్షుడు కోడూరి శంకరయ్య, రెడ్డి సంఘం సభ్యులు కంచాడి కిరణ్‌రెడ్డి, అక్కనపల్లి సత్తయ్య, అక్కినపల్లి కనకయ్య, కడకుంట్ల తులసిదాస్ తదితరులు ఉన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

- ఎస్సై ప్రశాంత్ రెడ్డి


శాంతినగర్‌వాసులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రశాంత్‌రెడ్డి

కోనరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం శాంతినగర్‌లో మాదక ద్రవ్యాలు, రోడ్డు భద్రత, 100 డయల్‌పై ఆదివారం కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని ఎస్సై ప్రశాంత్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు, వాహనదారులు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని అన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటి వల్ల వచ్చే ప్రమాదాలను వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శాంతినగర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ


అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వేములవాడలోని వాసవినగర్‌లో ఆదివారం రాత్రి మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ పడిపూజను ఆదర్శ్ అచ్యుత్ నివాసంలో అల్మాస్‌పూర్ గురుస్వామి వందిళ్ల శ్రీనివాస్ ఘనంగా నిర్వహించారు. ఈ పూజలకు దాదాపు 300మంది అయ్యప్ప భక్తులు పాల్గొని భక్తిపాటలతో హోరెత్తించారు.

రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నరహరి లక్ష్మారెడ్డి

భగత్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని బీజేపీ విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయ సెల్ రాష్ట్ర కో చైర్మెన్ నరహరి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెన్షన్ బకాయిలను నిలిపి వేయలేదన్నారు. గొప్పలు చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ చెందిన వారికి రావలసిన బెనిఫిట్స్‌ను చెల్లించకపోవడం శోచనీయమన్నారు. రేవా ఆద్వర్యంలో ఈనెల 17న హైదరాబాద్‌లో తలపెట్టిన దర్నాకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో రాగి సత్యనారాయణ, కొండం వెంకటరెడ్డి, బొంగుని పరభురాములు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు 'టెట్' మినహాయించాలి

పీఆర్టీయూ టీఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి




సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

కరీంనగర్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్టీ యూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు అయిలేని కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో జరిగి న జిల్లాశాఖ అత్యవసర సమావేశా నికి ఆయన ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. ప్రతి ఉపాధ్యాయుడు బోధనలో వస్తున్న మార్పులను, నూతన పోకడలను ఎప్పటికప్పు డు అందిపుచ్చుకుంటూ వృత్యంతర శిక్షణను పొందుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. ఉపాధ్యాయ వృత్తిని సమర్థవంతంగా నిర్వహించడానికి మెరుగైన బోధనను అందించడానికి టెట్ అర్హత మాత్రమే ప్రామాణికమని భావిం చడం దురదృష్టకరమన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఒక వేళ మెరుగైన బోధన విద్యార్థులకు అందాలని కోర్టు, ప్రభుత్వా లు భావిస్తే ఉపాధ్యాయులకు ప్రత్యేక వర్క్‌షాప్‌లు ఏర్పా టు చేసి ట్రైనింగ్ ఇస్తే సరిపోతుందన్నారు. 20 నుంచి 30 సంవ త్సరాలు టీచింగ్‌లో అనుభవం ఉన్న ఉపాధ్యాయులను సమాజం లో వారికి ఉన్న గౌరవాన్ని ప్రతిష్ఠను ఇప్పుడు టెట్ ఉత్తీ ర్ణత తప్పనిసరి చెప్పడం ద్వారా తగ్గించినట్టేనని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభు త్వాలు జోక్యం చేసుకుని సు ప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటీషన్లు వేయాలని, కేంద్ర ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి 2009 యాక్టు సెక్షన్ 23ను పార్లమెంట్‌లోసవరించే విధం గా కృషి చేయాలని తెలిపారు. 2010 కంటే ముందు నియామ కమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పీఆర్టీయూ టీఎస్ పత్రికా సంపాదక వర్గ సభ్యుడు జమీల్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు రాంమోహన్ రావు, మండల ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్ ఉన్నారు.

ఒకే సారి 30 ఇటుకలు

● సిరిసిల్లలో వలస కార్మికుల నైపుణ్యం


ఇటుకలు మోస్తున్న బీహార్ కార్మికుడు

సిరిసిల్ల టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జానెడు పొట్టకోసం రాష్ట్రాల సరిహద్దులను దాటి వస్తున్న వలస కార్మికులు కష్టాలు పడుతున్నారు. పుట్టి పెరిగిన ఊరిలో ఉపాధి లేక పొట్టచేత బట్టుకొని బీహర్ నుంచి కార్మిక కుటుంబాలు తెలంగాణకు వలస వస్తున్నాయి. ఆదివారం జిల్లా కేంద్రం గాంధీనగర్‌లో ఓ భవనం మొదటి అంతస్తు నిర్మాణం పనులలో బీహార్‌కు చెందిన కార్మికుడు ఒకేసారి 30 ఇటుకలను మొద టి అంతస్తుకు మొట్ల ద్వారా కష్టపడుతూ తీసుకెళ్తున్న దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమారాతో క్లిక్ మనిపించింది.

42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యం

● బీసీ సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్

గణేశ్‌నగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కన కయ్యగౌడ్ అన్నారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకయ్యగౌడ్ మాట్లా డుతూ 60 శాతానికిపైగా ఉన్న బీసీ జనాభా న్యాయబద్ధంగా తమకు రావాల్సిన హక్కు కోసం యుద్ధం చేస్తోందన్నారు. బీసీ ధర్మ పోరాట దీక్షల తో కేంద్రం దిగి రావాలన్నారు. సీఎం ఢిల్లీకి అఖిల పక్షంతో వెళ్లి ప్రధానిపై ఒత్తిడి పెంచాలన్నారు. డిసెంబరు ఒకటి నుంచి జరిగే పార్లమెంట్ వేదికగా కేంద్రంపై రాష్ట్రం పోరాడాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్ కేంద్రంపై పోరాడ డానికి రాజకీయ కార్యచరణ ప్రకటించాలని కోరారు. బీసీలను నమ్మించి మోసం చేస్తే రాష్ట్ర ప్రభు త్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆది మల్లేశం పటేల్, ఆశిష్‌గౌడ్, పురుషోత్తం, జీఎస్ ఆనంద్, రంగు సంపత్‌గౌడ్, రాజకుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జూనియర్స్, సీనియర్స్ పురుషుల, మహిళల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 210 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. మాజీ ఎమెల్యే ఆరెపల్లి మోహన్, కబడ్డీ సంఘం చైర్మన్ వెలిచాల రాజేందర్ రావు, అధ్యక్షుడు డాక్టర్ అమిత్‌కుమార్ ప్రారంభించారు.

అసంపూర్తిగా ఆడిటోరియం


నిరుపయోగంగా మారిన ఆడిటోరియం

కోనరావుపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు అప్పటి ప్రభుత్వం కోనరావుపేట మండల కేంద్రంలో ఆడిటోరియం నిర్మాణం చేపట్టింది. గత పది సంవత్సరాల క్రితం చేపట్టిన ఆడిటోరియం నిర్మాణం పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో పనులు చేసి ప్రారంభించకుండా అలాగే వదిలేయడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోనైనా పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి ఆడిటోరియాన్ని ప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు.